కుదిరితే బేరం.. లేదంటే వైరం

- ఏకగ్రీవాలపై ఫోకస్ పెట్టిన అధికార పార్టీ
- ఇతర పార్టీల అభ్యర్థులకు గాలం
- ఇప్పటికే జోరుగా మంతనాలు

వివరాలు 8వ పేజీలో..

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

బుధవారం 3 డిసెంబరు 2025

'గుర్తు'కుంటేనే..

తొలివిడత ఎన్నికలకు నేడు సింబల్స్ కేటాయింపు



- సర్పంచ్‌లకు 30, వార్డు సభ్యులకు 20గుర్తులు ప్రకటించిన ఈసీ
- పార్టీరహిత ఎన్నికలు కావడంతో గుర్తులే కీలకం
- బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉండవు..
- గుర్తుతోనే అభ్యర్థులను ఓటర్లు గుర్తుంచుకోవాలి
- రెబల్స్‌ను తప్పించే పనిలో ప్రధాన అభ్యర్థులు
- ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవుల ఆఫర్.. ఖర్చుల చెల్లింపుకు సై
- ఉత్కంఠగా మారిన పంచాయతీ సమరం

గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా మారుతున్నాయి. తొలివిడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో బుధవారం అభ్యర్థులకు గుర్తులు కేటాయించనున్నారు. పార్టీరహితంగా జరిగే ఈ ఎన్నికల్లో గుర్తే కీలకం కావటంతో తమకు ఏ సింబల్ లభిస్తుందో అనే ఉత్కంఠలో అభ్యర్థులు ఉన్నారు. మరో వైపు నామినేషన్ల ఉపసంహరణకు కూడా బుధవారమే చివరిరోజు కావటంతో రెబల్స్‌ను బరి నుంచి తప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇస్తున్నారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చుతో పాటు ఎంతోకొంత గుడ్‌విల్ కూడా ఇస్తామంటూ ఆఫర్లు ఇస్తున్నారు. దీంతో ఊరూరా పంచాయతీ ఎన్నికలు హాట్‌టాపిక్‌గా మారాయి.

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీలకు సంబంధం లేకుండా జరిగే విషయం విదితమే. అభ్యర్థులకు కేటాయించే గుర్తులు స్వతంత్ర సింబల్స్ కావటంతో వారికి అవే కీలకంగా కానున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొలివిడతలో 555 సర్పంచ్ స్థానాలకు 3,567 నామినేషన్లు, 4,952 వార్డు సభ్యుల స్థానాలకు 11,227 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటికి సంబంధించి రెండు రోజులుగా స్క్రూటినీ చేపట్టారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. సాయంత్రం 5గంటలలోపు నామినేషన్లు విత్‌డ్రాలు ముగిసిన వెంటనే పోటీలో ఉండే అభ్యర్థులకు ఎన్నికల సంఘం గుర్తులు కేటాయించనుంది. సర్పంచ్ అభ్యర్థుల కోసం ఉంగం, కత్తెర, బ్యాట్, ఫుట్‌బాల్, లేడీస్ పర్సు, టూత్ పేస్ట్, టీవీ రిమోట్, స్పానర్, చెత్త డబ్బా, బ్లాక్ బోర్డు, కొబ్బరి తోట, బెండకాయ, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, చాయ్ జాలీ, చేతికర్ర, పలక, మంచం, టేబుల్, బ్యాటరీ లైట్, బ్రష్, బ్యాట్‌మెన్, తెర చాపతో ఉన్న పడవ, బిస్కెట్, ఫ్లూట్, చైన్, చెప్పులు, బెలూన్, క్రికెట్ స్టంప్స్ గుర్తులుగా 30రకాలుగా ఎన్నికల సంఘం కేటాయించింది. అలాగే వార్డు సభ్యులకు గౌను, గ్యాస్ స్టవ్, స్టూలు, గ్యాస్ సిలిండర్, బీరువా, విజిల్, కుండా,

(మిగతా 7లో..)

సర్పంచ్ అభ్యర్థులకు కేటాయించనున్న గుర్తులు




వార్డు సభ్యుల అభ్యర్థులకు...



కనికరించరేం..!

- సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలకు కలగని మోక్షం
- డ్యూటీ చేయలేని కార్మికులకు సర్ఫేస్ పనులు
- 'అన్‌ఫిట్' దరఖాస్తు పెట్టుకున్నా స్పందించని అధికారులు
- ఏళ్లు గడుస్తున్నా కదలని ఫైళ్లు



వారసత్వ ఉద్యోగం కోసం దరఖాస్తు పెట్టుకున్న కార్మికుడు మల్లేష్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. విధులు నిర్వర్తించేందుకు ఆరోగ్యం సహకరించడం లేదని, నిబంధన ప్రకారం తమ బదులు తమ వారసులకు ఉద్యోగం ఇవ్వండని మొరపెట్టుకున్నా ఆలకించే వారు కరువయ్యారు. మెడికల్ అన్‌ఫిట్ సర్టిఫికెట్లతో దరఖాస్తు పెట్టుకున్నా అధికారులు ఎవరూ కనికరించడం లేదు.

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇవ్వాలని గత ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో నిర్ణయించారు. దీనికి ప్రత్యేక జీవోను 2018 ఏప్రిల్‌లో తీసుకొచ్చారు. దీంతో సింగరేణి కార్మికుల్లో హర్షం వ్యక్తమైంది. అనారోగ్యంతో బాధపడుతూ ఉద్యోగం చేయలేని వారికి ఈ ఉత్తర్వులు ఊరటనిచ్చాయి. ఈ క్రమంలోనే అనేక మంది మెడికల్ అన్‌ఫిట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 550 మంది దరఖాస్తులు పెట్టుకున్నారు. వీటిలో భూపాలపల్లి ఏరియాలో సుమారు 125 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి ఇప్పటి వరకు మోక్షం కలగలేదు. ఒకరి కూడా మెడికల్ అన్‌ఫిట్ వర్తించ లేదు.. వారి వారసులకు ఉద్యోగాలూ రాలేదు. దీంతో అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులు మూలుగుతూనే అష్టకష్టాలతో డ్యూటీలు చేస్తున్నారు. మిగతా ఉద్యోగులు కొందరి వద్ద సింగరేణి డాక్టర్లు, అధికారులు ముడుపులు తీసుకొని వారసత్వ ఉద్యోగాలకు మార్గం సుగమం చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

కొర్రీలు.. వేధింపులు

మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగులకు వేధింపులు తప్పడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు అనేక కొర్రీలు పెడుతూ దరఖాస్తులను ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారు. పలు చోట్ల అయితే.. డబ్బులు ఇవ్వందే ఫైలు కదల డం లేదని విమర్శలు కూడా ఉన్నాయి. సమస్య న్యాయబద్ధంగా ఉన్నప్పుడు ఎలాంటి ఆంక్షలు లేకుండా వారసుడికి ఉద్యోగం అవకాశం కల్పించాలి కానీ.. ఇబ్బందులకు గురిచేయడం సబబు కాదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా తాము ఏ పనిచేయలేమని, అనారోగ్యంతో బాధపడుతున్నామని ఆస్పత్రి రిపోర్టులతో దరఖాస్తు చేసుకుంటే.. సర్ఫేస్ పనులు అప్పగిస్తున్నారని అంటున్నారు. ఈ విషయంపై (మిగతా 8వ పేజీలో)

ముగిసిన రెండో విడత నామినేషన్లు

నేడు మూడు మండలాలకు మూడో విడత

ములుగు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల రెండవ విడత నామినేషన్ల ప్రక్రియ మంగళవారం ముగిసింది. బుధవారం మరో మూడు మండలాలకు నామినేషన్ల స్వీకరణ చేపట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అలాగే మొదటి విడతలో ముగిసిన తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కూడా అదే రోజు జరగనుంది.

పంచాయతీ ఎన్నికల మూడో విడతలో భాగంగా నామినేషన్ల స్వీకరణ వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో బుధవారం ప్రారంభం కానుంది. వాజేడు మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా, 152 వార్డులు ఉన్నాయి. వెంకటాపురం మండలంలో 18 గ్రామ పంచాయతీలు, 166 వార్డులు ఉన్నాయి. కన్నాయిగూడెం మండలంలో 11 గ్రామ పంచాయతీలు, 90 వార్డులు ఉన్నాయి. మొత్తంగా మూడు మండలాల్లోని 46 జీపీలు, 408 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ మూడు రోజుల పాటు కొనసాగనుంది.

నేడు ఉపసంహరణ ప్రక్రియ

తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ బుధవారం జరగనుంది. మొదటి విడతలో మూడు మండలాల్లో అధికారులు నామినేషన్ల స్వీకరణ చేపట్టగా 1,363 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వీటిలో 294 సర్పంచ్ స్థానాలకు, 969 వార్డు స్థానాలకు నామినేషన్లు వచ్చాయి. గోవిందరావుపేట మండలంలో 91 సర్పంచ్, 378 వార్డు మెంబర్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. తాడ్వాయి మండలంలో 119 మంది (మిగతా 8వ పేజీలో)

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మూడో రోజు 2-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
ములుగు	19	57 (102)	172	296 (431)
జేడీ మల్లంపల్లి	10	46 (70)	90	129 (212)
వెంకటాపూర్	23	70 (114)	200	329 (466)

నోట్: (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

ఐదుగురు రౌడీషీటర్ల బైండోవర్

మొగుళ్లపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐదుగురు రౌడీ షీటర్లను తహసీల్దార్ సునీత ఎదుట మంగళవారం హాజరు పరిచామని ఎస్సై అశోక్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని అన్నారు. బైండోవర్ అయిన రౌడీషీటర్లలో మండలంలోని ఇస్సిపేట గ్రామానికి చెందిన పండు గ రాజు, పొన్నాల ధనుంజయ్, మొగుళ్లపల్లికి చెందిన వేముల మహేందర్, పరకాల వెంకటాపూర్‌కు చెందిన దొగ్గెల తిరుపతి, పోతుగల్‌కు రేణుకుంట్ల దేవయ్య ఉన్నారని పేర్కొన్నారు. రౌడీషీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆయన సూచించారు.

సైబర్ నేరాలను అరికట్టాలి

- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్
- 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సంకీర్త్, అధికారులు

కృష్ణకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజురోజుకూ పెచ్చుమీరిపోతున్నాయని భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. వాటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' పేరిట రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను పోలీసు జిల్లా కార్యాలయంలో ఎస్పీ మంగళవార ఆవిష్కరించారు. అనంతరం సైబర్ నేరాపై సమీక్షించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 42 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు వివరించారు. ఇవి డిసెంబరు 2 నుంచి జనవరి 12 వరకు జరుగుతాయన్నారు. ప్రతివారం ప్రత్యేక థీమ్‌తో అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. సైబర్ మోసాల నివారణలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి ప్రోగ్రాములు దోహదపడతాయని తెలిపారు. లోన్‌యాప్స్, ఆన్‌లైన్ లింక్స్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్ కాల్స్, ఓటీపీ స్కామ్స్, డిజిటల్ అరెస్ట్, వాట్సప్, ట్విట్టర్, ఆన్‌లైన్ స్క్రాచ్‌కార్డుల ఇతరత్రా పేర్లతో నేరగాళ్లు మోసం చేస్తున్నారని తెలిపారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు కాల్ చేసి, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, కాటారం డీఎస్పీ సత్యనారాయణ, సీఐ నరేష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రాతి నిర్మాణాల్లో పొరపాట్లకు తావుండొద్దు

- ములుగు కలెక్టర్ దివాకర
- మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన

6



గద్దెల పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కృష్ణకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని జవహర్‌నగర్ కాలనీ బొబ్బగడి చెరువులో గుర్తు తెలియని మృతదేహం మంగళవారం లభ్యమైంది. చెరువులో మృతదేహం తేలియాడుతుండగా అటుగా వెళ్లిన వారు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై సాంబమూర్తి తన సిబ్బందితో అక్కడకు చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఆకుపచ్చ టీషర్టు, నలుపురంగు ఎరుపు కలర్ ఫుల్‌డ్రాయర్, బ్రౌన్ కలర్ సాక్కులు ధరించి, చేతికి రెండు వరుసల దేవుడి దండ కలిగి ఉన్నాడని ఎస్సై తెలిపారు. మృతుడి వయసు 40-50 ఏళ్ల ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా గుర్తు పడితే తమకు సమాచారం అందించాలని కోరారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

- సాధారణ పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి



జడల్‌పేటలో నామినేషన్ వివరాలను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు ఫణీంద్రరెడ్డి

చిట్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నియమావళిని పకడ్బందీగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ఫణీంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని చిట్యాల, జడల్‌పేటలో నామినేషన్ల ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తున్నట్టు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ, వివరాల నమోదు ప్రక్రియను నిశితంగా పరిశీలించిన ఆయన తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో జయశ్రీ, తహసీల్దార్ ఇమామ్‌బాబా షేక్, ఎంపీవో రామకృష్ణ, ఆర్ఐ రాజేందర్, కార్యదర్శులు రవికుమార్, దేవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విదేశాల్లో ఉన్నత విద్యపై ఉచిత శిక్షణ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉన్నత విద్య కోసం వచ్చే స్కాలర్‌షిప్పులు, విద్యావకాశాల కోసం నిర్మాణాత్మక అవగాహన సదస్సులు, ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి ఇందిరా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ (ఐఈఎల్‌టీఎస్) విదేశాల్లోని అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంతర్జాతీయ స్కాలర్‌షిప్పులు పొందడమే లక్ష్యంగా నిర్మాణాత్మక అవగాహన సెషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఈ సందర్భంగా ఉచిత శిక్షణ కూడా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు ఈ నెల 1 నుంచి 21 వరకు టీజీబీసీ స్టడీ సర్కిల్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 0870-2571182, 040-24071178 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

మేడారంలో చురుగ్గా అభివృద్ధి పనులు

- ముందస్తుగా వస్తున్న భక్తులు
- క్యూ లైన్ల ఏర్పాటుకు నమూనా పరిశీలన

7

రోడ్ల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఆర్అండ్‌బీ అధికారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. రోడ్ల నిర్మాణం పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో జరుగుతున్న ప్రతి మండల, గ్రామ ప్రధాన రహదారుల నిర్మాణ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆలస్యమైతే అందుకు కారణాలు (మిగతా 8వ పేజీలో)

నియామక పత్రం అందుకున్న కర్ణాకర్



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుంటున్న భట్టు కర్ణాకర్

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా భట్టు కర్ణాకర్ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని మంగళవారం అందుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో పీసీసీ ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగిన సందర్భంగా కర్ణాకర్ నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. అలాగే ప్రతి కార్యకర్తకూ అందుబాటులో ఉంటానన్నారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు అప్పగించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

మంచు దుప్పటిలో మన్యం

- పంజా విసురుతున్న చలి పులి
- బయటికి రావడానికి జంకుతున్న ప్రజలు

వివరాలు 6లో...




బ్యారేజీలో విడిచేందుకు చేప పిల్లలను తీసుకువచ్చిన వాహనాలు

సమ్మక్క సాగర్ బ్యారేజీలో చేపపిల్లల విడుదల

కన్నాయిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీలో చేపపిల్లలను ఫిషరీ అధికారులు, పెసా మొబిలైజర్లు 36 లక్షల చేప పిల్లలను మంగళవారం వదిలారు. గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో ఇలా ప్రభుత్వ పథకాలను మండలంలో అమలు చేయడంపై విమర్శలకు తావిచ్చింది. పంచాయతీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే ఇలా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన వారితో సూర్య

వెంకటాపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామానికి చెందిన బుర్ర యాదయ్య గౌడ్‌తో పాటు పలువురు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ యువజన రాష్ట్ర నాయకుడు కుంజ సూర్య కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులపై వివిధ పార్టీల వారు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్‌రెడ్డి, అధికార ప్రతినిధి బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ప్రవళిక ఎంపిక



మల్హర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం ఎడ్లపల్లి మోడల్ స్కూల్ ఇంటర్ విద్యార్థిని ప్రవళిక ఎంపికైంది. ఈ మేరకు ప్రిన్సిపాల్ పూర్ణచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల క్రితం జిల్లాస్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో ప్రవళిక ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికైందని పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ ఆమె పాల్గొననున్నట్టు తెలిపారు.

రాతి నిర్మాణాల్లో పొరపాట్లకు తావుండొద్దు

» ములుగు కలెక్టర్ దివాకర
» మేడారం అభివృద్ధి పనుల పరిశీలన



తయారు చేస్తున్న రాతి స్తంభాలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర, అధికారులు

తాడ్వాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మేడారం జాతర అభివృద్ధి పనుల్లో ఎలాంటి పొరపాట్లకు తావుండద్దని ములుగు కలెక్టర్ దివాకర అధికారును ఆదేశించారు. మంగళవారం మేడారంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి పనులను పరిశీలించారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల నిర్మాణాల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా అలాగే రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయాలని అన్నారు. ఆదివాసీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా దేవస్థానం పనులు ఉండాలన్నారు. పనుల పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో ఐటీడీఏ అతిథిగృహంలో సమీక్షించారు. ఒక్కొశాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడుతూ పనుల పురోగతిని అడిగి తెలుకున్నారు. పనుల్లో ఎలాంటి పొరపాట్లకు జరుగకుండా అధికారులు స్థానికంగా ఉంటూ పనులను పర్యవేక్షించాలని, నాణ్యత లోపాలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మాస్టర్ ప్లాన్ నివేదికల ప్రకారం నిర్దేశించిన గడువులోగా అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. దేవస్థానం నిర్మాణం ప్రత్యేక అధికారులు, విద్యుత్, రహదారుల విస్తరణ అధికారులు, పోలీస్, అటవి, రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్షంచి పలు సూచనలు చేశారు.

అనంతరం మేడారం పరిసరాలను పరిశీలించారు. రహదారుల విస్తరణ పనుల్లో ట్రాఫిక్‌జామ్ సమస్యలు తలెత్తకుండా భక్తు ల రద్దీని నివారించేలా విస్తరణ, ప్రధాన కూడళ్లు, డైవర్షన్ చేపట్టా లన్నారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం, టెంటెడ్ అకామిడేషన్ కోసం 3 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. అలాగే పోలీసులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తే పరిసరాలు, క్యూలైన్ల ఏర్పాటు, దేవస్థానం అభివృద్ధి పనులను పరిశీలిం చారు. దేవస్థానంలో డిసెంబరు 4న పగిడిద్దరాజు, గోవిందరాజుల పునః ప్రతిష్ఠాపన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. భక్తు లకు దేవస్థానంలో ఇబ్బందులు కలుగకుండా దర్శించుకునేలా ప్రాంగ ణంలోని గద్దెల పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశం, డీఎస్పీ రవీందర్, సీఐ దయాకర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌బాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

రామప్ప గోపురంపై చంద్రుడు



కనువిందు చేసిన దృశ్యం

మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గోపురంపై చంద్రుడు మంగళవారం సాయంత్రం కనిపించి కనువిందు చేశాడు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ దృశ్యాన్ని పర్యాటకులతో పాటు స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి)



నేడు మూడో విడత ఎన్నికల షెడ్యూల్ విడుదల

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను బుధవారం ప్రకటించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ మంగళవారం తెలిపారు. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నామని తెలిపారు. ఇప్పటికే మొదటి విడతకు గత నెల 27న నోటిఫికేషన్ జారీ చేయగా నామినేషన్ల ప్రక్రియ కూడా పూర్తయ్యిందని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఈ నెల 3న ఉందన్నారు. తుది జాబితాను కూడా అదే రోజు సాయంత్రం ప్రకటిస్తామని తెలిపారు.

అలాగే రెండో విడత నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 2వ తేదీతో ముగియగా, మూడో విడత నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 3న ఉదయం 10.30గంటల నుంచి ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 6న నామినేషన్ల పరిశీలన, 7న అభ్యంతరాలు, 8న పరిష్కారాలు, 9న మధ్యాహ్నం 3గంటల వరకు ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని తెలిపారు. అదే రోజు జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. మొదటి దశకు సంబంధించిన ఎన్నికలు ఈనెల 11న జరుగుతాయని పేర్కొన్నారు. రెండో విడత ఎన్నికలు ఈనెల 14న, మూడో విడత 17న జరుగుతాయని తెలిపారు. ఎన్నికలు, ఓట్ల లెక్కింపు ప్రక్రియలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు.

రెండు గ్రామాల్లో ఏకగ్రీవం



లావుడ్యా రమేష్, పాశిగడ్డతండా



ఎం. మనోహర్, చైన్‌పాక

చిట్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చైన్‌పాక, పాశిగడ్డతండా గ్రామ పంచాయతీ పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. రెండు గ్రామాల్లో ఎస్టీ జనరల్ రిజర్వేషన్ కాగా ఇద్దరు అధికార కాంగ్రెస్ మద్దతుతో నామినేషన్లు దాఖ లు చేసిన అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. చైన్‌పాకలో సర్పంచ్‌గా మాంత మనోహర్ ఒక్కరే నా మినేషన్ దాఖలు చేయగా 8 వార్డు స్థానాలకు ఒక్కొక్కరు చొప్పున చేశారు. అలాగే పాశిగడ్డతం డా సర్పంచ్‌గా లావుడ్యా రవీందర్ నామినేషన్ దాఖలు చేయగా 6 వార్డులను ఒక్కొక్కరు చొప్పు న మాత్రమే వేశారు. దీంతో రెండు గ్రామాల పాలకవర్గాలు ఏకగ్రీవమైనట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

ములుగు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో నేడు జరిగే 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ 2 డిపో మేనేజర్ ఎమ్. రవిచందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 వరకు నిర్వహించబడునని, జిల్లా పరిధిలోని ప్రయాణికులు 7382425150 నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలు, సూచనలను తెలియజేయాలని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బంది సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీ త్‌సింగ్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి రిటైర్డ్ అయిన ఏఎస్సై శ్రీనివాస్, ఏఆర్ ఎస్సై మక్బూల్ పాషాలను సీపీ సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్ కుమార్, శ్రీనువాస్, ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ సతీష్, స్పర్జన్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన సిబ్బందితో సీపీ సన్‌ప్రీత్ సింగ్

పెన్షనర్లను విస్మరించిన పాలకులు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి వీరయ్య

వడ్డెపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల సమస్యలను విస్మరించాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుంకరి వీరయ్య అన్నారు. మంగళవారం హనుమకొండ గోకుల్‌నగర్‌లోని అంబేద్కర్ భవన్‌లో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీపీఆర్‌పీఏ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం అధ్యక్షతన జిల్లా 7వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్యతో పాటు టీపీఆర్‌పీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎల్. అరుణ మాట్లాడారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ, డీఆర్‌లను వెంటనే ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మానిటరీ బెనిఫిట్స్ చెల్లించేలా పీఆర్‌సీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 20 ఏళ్ల సర్వీస్‌కు ఫుల్ పెన్షన్ 2018 జూలై 1 నుంచి అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తున్నట్లు గ్రాట్యూటీ రూ.20లక్షలు చెల్లించాలన్నారు. ప్రతీ జిల్లాలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ అలవెన్స్ రూ.600 నుంచి రూ.3వేల వరకు పెంచాలని పెన్షనర్లకు తెలంగాణ ఆవిర్భావ పారితోషికం ఇవ్వాలని కోరారు. ఈ మహాసభలో టీపీఆర్‌పీఏ జిల్లా గౌరవ సలహాదారు రాంనర్సింహాచారి, డీటీవో శ్రీనివాస్‌కుమార్, డాక్టర్లు కంచర్ల సుధీర్, శరత్ బాబు, నాయకులు పరికిపండ్ల వేణు, జె. ప్రభాకర్‌రెడ్డి, కరేటి శంకర్‌రావు, సంపత్‌కుమార్, రహమాన్, దామోదర్ పాల్గొన్నారు. అనంతరం టీపీఆర్‌పీఏ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తూపురాణి సీతారాం, ప్రధాన కార్యదర్శిగా నారాయణగిరి వీరన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా బేతి శంకర్ లింగం, ఆర్థిక కార్యదర్శిగా సిద్ధి రాజయ్యను ఎన్నుకున్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



మహిళలకు సూచనలిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా వెంకటాపురం మండలంలోని ఎదిర ఆరోగ్య మహిళా కేంద్రంలో మంగళవారం ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ 60 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్ భవ్యశ్రీ సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

అక్క నెంబర్‌తో కుచ్చుటోపీ


» సైబర్ నేరగాళ్ల వలలో ప్రభుత్వ ఉద్యోగి
» రూ.47 వేలు ఫోన్ పే

ఖానాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. నమ్మించి మోసం చేసి జనాల జేబులు లూటీ చేస్తున్నారు. తాజాగా వరంగల్ జిల్లా ఖానాపురంలో ఇలాంటి సంఘటన జరిగింది. మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహిపాల్‌కు మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తన సోదరి (అక్క) నంబరుతో మెసేజ్ వచ్చింది. అర్జంట్‌గా మనీ అవసరం ఉంది.. పంపించు అని అందులో ఉంది. మరి కాసేపటికే 80859 10355 నంబరుకు రూ.47 వేలు పంపించాలని మరొక మెసేజ్ వచ్చింది. దీంతో ఆఫీసు పని ఒత్తిడిలో ఉన్న మహిపాల్ మరో ఆలోచన లేకుండా అదే నంబరుకు రూ.47 వేలు ఫోన్‌పే చేశారు. కొద్దిసేపటిలోనే మరి కొంత డబ్బు కావాలని మరొకసారి తన సోదరి నంబరు నుంచి మెసేజ్ వచ్చింది. దీంతో అనుమానం వచ్చి తన సోదరి, బావలకు ఫోన్ చేయగా తాము ఎలాంటి మెసేజ్ చేయలేదని చెప్పారు. దీంతో తనను సైబర్ నేరగాళ్లు మోసగించారని భావించి వెంటనే బ్యాంకుకు వెళ్లి అధికారులకు విషయం చెప్పారు. సైబర్ క్రైం అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

మంచు దుప్పటిలో మన్యం

» పంజా విసురుతున్న చలి పులి
» బయటికి రావడానికి జంకుతున్న ప్రజలు

ఏటూరునాగారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో చలి పంజా విసురుతోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీలో వారం రోజుల నుంచి రోజురోజుకు చలి తీవ్రత పెరుతుండడంతో గజ గజ వణికిపోతున్నారు. గోదావరి తీరంలో వారం రోజులుగా చలి పంజా విసురుతుండడంతో గిరిజన గూడాలన్నీ మంచులో ముద్దవుతున్నాయి. బుధవారం శీతల గాలుల ప్రభావం, పొగ మంచు కురుస్తుండడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సాయంత్రం 6 నుంచే చలి ప్రారంభమవుతోంది. ఉదయం 9 వరకు సూర్యుడిని మంచు తెరలు కమ్మేస్తున్నాయి. దీంతో ఉదయం 10 వరకూ చలి తీవ్రత తగ్గడం లేదు. 9 దాటినా పొగ మంచు వీడటం లేదు. మంచు తీవ్రతకు లైట్లు వేసినా రోడ్డు కనిపించక పోవడంతో వాహనదారులు ముందుకు సాగేందుకు నానా తంటాలు పడుతున్నారు. చలికి తట్టుకోలేక ప్రజలు చలి మంటలకు అతుక్కు పోతున్నారు. దీంతో బారెడు పొద్దెక్కినా రోజు వారి అవసరాలు, వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు, చిరు వ్యాపారులు రగ్గులు, చలికోట్లు, స్వెట్టర్లు ధరించకుండా బయటకు వెళ్లలేక పోతున్నారు. ఏటూరునాగారం చెంతనే గోదావరి నది, వాగులు వంకలు ఉండడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. చలితో పాటు శీతల గాలులు చిన్నారులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. చలి గాలుల కారణంగా చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా రెండేళ్ల లోపు చిన్నారుల్లో న్యూమోనియా వ్యాధి సోకుతోంది. ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదైన సమయంలో శ్వాసకోశ సంబంధ వ్యాధులు చలికి తీవ్రమవుతున్నాయి.




వాజేడులో కురుస్తున్న మంచు



ఏటూరునాగారం వై-జంక్షన్‌లో భారీగా కమ్ముకున్న పొగ మంచు

వాజేడు : ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. మన్యంలో మంచు విపరీతంగా కురుస్తుంది. మంగళవారం మండలవ్యాప్తంగా దట్టమైన పొగ మంచు కమ్ముకుంది. ఉదయం 10 గంటల వరకు మంచు కురుస్తూనే ఉండడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మంచు అందాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తున్నాయి.

కోడ్ కూసింది.. జాగ్రత్త..

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన అమల్లోకి ఎంసీసీ
- నిఘా కోసం ప్రత్యేక బృందాల ఏర్పాటు

వర్ధన్నపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

ఏం చేయాలి..? ఏం చేయొద్దు..?

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యాన మంత్రులు, అధికారిక పర్యటనలను ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. అధికారిక వాహనాలను అధికారిక నివా సం నుంచి కార్యాలయానికి, అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానికఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే కనుక నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధన ల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారం లో ఉన్న పార్టీలు సంక్షేమపథకాలను ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు, వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

ఏమిటీ కోడ్?

పోటీ చేసే అభ్యర్థులు, అధికారం, ప్రతిపక్ష పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులను ఎన్నికల సమయాన సమానంగా చూడడంతో పాటు నిబంధనలు మీరకుండా పర్యవేక్షించేందుకు కోడ్ అమలు చేస్తారు. ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక బృందాలనుసైతం ఏర్పాటు చేశారు. సాధారణ ప్రవర్తన, సమావేశాలు, ఊరేగింపులు, రోజువారీ కార్యకలాపాలు, పార్టీ కార్యక్రమాల పర్యవేక్షణ ఈ జాబితాలో ఉంటాయి.

ప్రచారంలో జాగ్రత్తలు

ఎన్నికల ప్రచార సమయాన పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, పరస్పర ద్వేషాభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. పరస్పర విమర్శల సమయాన పార్టీ విధానాలకు, కార్యక్రమాలు, గత చరిత్రకు మాత్రమే కట్టుబడి ఉండాలి. నిరాధర ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.





సీఎం సభాస్థలిని పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

నర్సంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా నర్సంపేటలో ఈ నెల 5న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్న సందర్భంగా నిర్వహించే బహిరంగ సభాస్థలాన్ని, హెలిప్యాడ్‌ను వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మంగళవారం పరిశీలించారు. డివిజన్‌లోని వివిధ మండలాల్లో సుమారు రూ.వెయ్యి కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా పట్టణ శివారులోని మెడికల్ కళాశాల సమీపంలో నిర్వహించే సభా స్థలాన్ని సీపీ పరిశీలించాక బందోబస్తు, ఇతర ఏర్పాట్లపై సీపీతో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ పున్నం కవీందర్‌రెడ్డి, ఎస్‌టీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ కాట భాస్కర్, పీసీసీ సభ్యులు పెండెం రామానంద్, డాక్టర్ పులి అనిల్, సొసైటీ చైర్మన్ బొబ్బాల రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతల సాంబరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్ర యాకూబ్‌రెడ్డి, నాయకులు కేతిడి వీరారెడ్డి, మాజీ కౌన్సిలర్ ఓర్సుఅంజలి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై ప్రైవేటు బిల్లు పెట్టాలి

- ఇండియా కూటమి ఆధ్వర్యంలో మద్దతు తెలపాలి..
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నాయకులు

బాలసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల అమలుపై కాంగ్రెస్‌పార్టీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ సమావేశాల్లో ఇండియా కూటమితో కలిసి ప్రైవేటు బిల్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. అప్పుడే బీసీలకు మద్దతు ఇచ్చేవారెవ్వరో, వ్యతిరేకించేవారెవ్వరో తేలుతుందని అన్నారు. మంగళవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈ నెల 8, 9 తేదీల్లో బీసీల ఛలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా పార్లమెంటు ముట్టడి, జంతర్ మంతర్ వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో బీసీలను తరలించేందుకు నిర్వహించిన మీడియా సమావేశంలో పలు అంశాలను వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని వాగ్దానం చేసి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. అఖిల పక్ష నాయకులను ప్రధాని నరేంద్రమోదీ వద్దకు తీసుకెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లకు 50 శాతానికి మించొద్దని సుప్రీంకోర్టు తీర్పు అడ్డొస్తే పార్టీపరంగా రిజర్వేషన్లను అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం.. సర్పంచ్ ఎన్నికలకు పార్టీ పరంగా కూడా అమలు చేయడం లేదన్నారు. జనరల్ స్థానాల్లో బీసీలను నిలబెట్టకుండా గ్రామస్థాయిలో రెడ్లను తిష్టవేసే విధంగా చేస్తున్నారని అన్నారు. అయినా పార్టీపరంగా ఇచ్చే రిజర్వేషన్ల భిక్షం తమకొద్దని, చట్టపరంగా కావాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అమలు గురించి అడగాల్సిన ప్రతిపక్షాలు.. చేయాల్సిన అధికార పక్షం బీసీ రిజర్వేషన్ల అమలు గురించి ఊసెత్తడం లేదన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ పార్టీ.. బీసీలను మోసం చేసిందని అన్నారు. ఛలో ఢిల్లీ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నుంచి బీసీలు రాజకీయాలకు అతీతంగా తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో బీసీ నాయకులు వల్లం సమ్మయ్య, తమ్మల శోభారాణి, బైరి రవికృష్ణ, దొడ్డిపాటి రఘుపతి పాల్గొన్నారు.

ప్రతీ రూపాయికి లెక్క చెప్పాల్సిందే..

- నామినేషన్ నుంచి ఎన్నికల వరకు ఖర్చు పరిగణలోకి
- కొత్త బ్యాంకు ఖాతా ద్వారానే చెల్లింపులు
- లేదంటే అభ్యర్థుల పదవి ఊస్ట్.. మూడేళ్ల వరకు అనర్హత



కేసముద్రం, డిసెంబరు 2, (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రచారం కోసం పెట్టే ప్రతీ రూపాయి ఖర్చుకు లెక్క తప్పనిసరిగా ఎన్నికల కమిషన్‌కు చెప్పాల్సిందే. ఏ విడత అయినా నామినేషన్ వేసిన మొదటిరోజు నుంచి ఎన్నికలు పూర్తయ్యే 15వ రోజు వరకు అభ్యర్థి ప్రతీ లావాదేవీని నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులను కొత్త బ్యాంకు ఖాతా ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. ఈ బ్యాంకు ఖాతా ప్రత్యేకంగా అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసమే వినియోగించాల్సిఉంటుంది. పాత బ్యాంకు ఖాతా అయితే అందులో నిర్వహించే ఇతర లావాదేవీలకు వివరణలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ఇబ్బందుల వల్లే నామినేషన్ వేసే అభ్యర్థులను కొత్త బ్యాంకుఖాతా ఇవ్వాలని రిటర్నింగ్ అధికారులు సూచిస్తున్నారు. ప్రతీ అభ్యర్థి గెలిచినా, ఓడినా ఎన్నికలు పూర్తయిన 45 రోజుల్లోగా ఖర్చు వివరాలను ఎన్నికల అధికారులకు సమర్పించాల్సిఉంటుంది. అభ్యర్థులు చేసే ఖర్చును పరిశీలించేందుకు అధికారుల బృందాలు ఉంటాయి. అనధికారికంగా భారీ మొత్తంలో ఖర్చు చేస్తే వివరాలన్నీ లెక్కించి అభ్యర్థి పేరున పరిశీలన బృందం అధికారులు నమోదు చేస్తారు.

అభ్యర్థుల ఖర్చుకు పరిమితులు

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఐదువేల జనాభాకు మించిన గ్రామంలో సర్పంచ్ అభ్యర్థులకు గరిష్టంగా రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులైతే రూ.50 వేల వరకు ఎన్నికల్లో ప్రచార ఖర్చు చేసుకునే అవకాశం ఉంది. ఐదు వేలలోపు జనాభా ఉన్న గ్రామంలో అయితే సర్పంచ్ అభ్యర్థులు రూ.1.5 లక్షలు, వార్డు సభ్యులైతే రూ.30 వేల వరకే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు పెట్టే ఎన్నికల ఖర్చును నామినేషన్ పత్రంలో సూచించిన బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే చేయాల్సి ఉంటుంది. ఈ ఖాతాలో డబ్బులు జమ చేయడం, ఎన్నికల ప్రచారానికి ఖర్చు చేసిన వివరాలన్నీ బ్యాంకు స్టేట్‌మెంట్ తీసి ఏ వ్యయం ఎందుకోసం చేశారనే విషయాలను పేర్కొంటూ ఎన్నికల అధికారులకు సమర్పించాలి. ఒకవేళ అభ్యర్థి గెలిచిన సంబరంలో 45 రోజుల్లోగా ఖర్చు సమర్పించడం మర్చిపోయి నిర్లక్ష్యం చేస్తే ఆ గెలుపును రద్దుచేసే అవకాశం ఉంటుంది. గెలిచినా, ఓడినా ఖర్చు సమర్పించాల్సిందే. అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చు లెక్కను అందివ్వకపోతే రాబోయే మూడు సంవత్సరాల పాటు ఆ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది.

'గుర్తు'కుంటేనే..

(5వ పేజీ తరువాయి)

డిష్ యాంటీనా, గరాట, మూకుడు, ఐస్ క్రీమ్, గాజు గ్లాస్, పోస్టు డబ్బా, ఎన్వలప్ కవర్, హాకీ స్టిక్‌బాల్, నెక్ టై, కటింగ్ ప్లేయర్, పెట్టే, విద్యుత్ స్థంభం, చాయ్ కెటిల్‌లను 20 రకాల గుర్తులను కేటాయించారు. అయితే ఈ గుర్తులే అభ్యర్థులకు ఓట్లను రాల్చేవి. దీంతో గ్రామాల్లో తక్కువ ఓట్లు ఉండటంతో ఒకటి రెండు ఓట్లు అటుఇటు అయినా అభ్యర్థుల తలరాత మారిపోయే అవకాశం ఉంటుంది.

కత్తెర, బ్యాట్ గుర్తులు దగ్గరి పోలిక ఉండటంతో పొరపాటును ఓటు అటుఇటుగా తడబడితే కష్టమే అనే ఆందోళనలో అభ్యర్థులు ఉన్నారు. బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, ఫొటోలు ఉండే అవకాశం లేకపోవటంతో గుర్తును గుర్తించే ఓటర్లు ఓటు వేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రజలకు గుర్తుంటే గుర్తు దక్కాలని తమ ఇష్టదైవాలకు అభ్యర్థులు పూజలు, ప్రార్థనలు చేస్తున్నారు. వీటితో పాటు ఈసారి బ్యాలెట్ పత్రాల్లో నోటాకూడా ఉండటంతో అభ్యర్థులకు లబ్‌డబ్ పెరిగింది.

వార్డు సభ్యుడిగా గెలిస్తే.. ఉప సర్పంచ్‌తో పాటు చెక్ పవర్‌తో పల్లె రాజకీయాల్లో చక్రం తిప్పవచ్చునని ఆశతో అనేక మంది కీలక నేతలు బరిలో దిగుతున్నారు. అయితే వందల్లోనే వార్డు ఓటర్లు ఉండటంతో వీరిని తమ వైపు తిప్పుకోవటం ఒక ఎత్తైతే.. తమ గుర్తులపై ఓటు పడేలా గుర్తును గుర్తించేలా అవగాహన కల్పించటం కష్టమేనని అభ్యర్థులు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులకు సరిగా కళ్లు కనబడకపోవటంతో గుర్తులను కచ్చితంగా గుర్తించి ఓటు వేయకపోతే తమ పరిస్థితి ఓటమికి దారితీస్తుందనే ఆందోళనలో సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఉన్నారు. అందుకే గుర్తు కీలకం కావటంతో అందరూ గుర్తించే గుర్తును తమక దక్కుతుందో లేదో అనే ఉత్కంఠలో అభ్యర్థులు ఉన్నారు.

జర తప్పుకో తమ్ముడూ..

పంచాయతీ ఎన్నికల్లో బేరసాలు, బుజ్జగింపుల పర్వం జోరుగా జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో మొదటి, రెండోవిడతల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీరహితంగా ఎన్నికలు జరుగుతున్నప్పటికీ పార్టీ మద్దతు లేకుండా గెలిచే పరిస్థితి లేదు. దీంతో ఒకే పార్టీ, కుటుంబానికి చెందిన ఇద్దరు ముగ్గురు పోటీ చేస్తుండటంతో వారిని బరిలో నుంచి తప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రధానంగా వచ్చే ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం ఇస్తా తమ్మీ.. అంటూ బుజ్జగిస్తున్నారు.

కొంచెం మండల స్థాయి నాయకుడైతే జడ్పీటీసీకి బరిలో దించుతాం.. ఎమ్మెల్యేను కూడా ఒప్పిస్తాం.. అంటూ బుజ్జగించే పనిలో పార్టీ నేతలు దిగుతున్నారు. తొలివిడతకు బుధవారమే చివరి రోజు కావటంతో బుజ్జగింపు పర్వాలతో పాటు మనీ ఆఫర్‌లు పెరిపోతున్నాయి. కులంలో, గ్రామంలో, యువతలో పట్టున్న లీడర్ బరిలో ఉంటే.. తప్పించేందుకు గుడ్‌విల్ తెరపైకి తెస్తున్నారు. ఇప్పటివరకు పెట్టిన ఖర్చులతో పాటు గుడ్‌విల్ కింద ఎంతోకొంత ఇస్తామంటూ బేరసాలకు దిగుతున్నారు. అన్ని పార్టీలు పంచాయతీ ఎన్నికలను కీలకంగా తీసుకోవటంతో గెలిచే ప్రతీ అవకాశాన్ని తమకు అనుకూలంగా మల్చుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

కులం ఓట్లే ప్రామాణికం

పంచాయతీ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. గెలుపు గుర్రాలపై నజర్ వేస్తున్నాయి. ప్రధానంగా కులం ఓట్లే ప్రామాణికంగా తీసుకుని అభ్యర్థుల ఎంపిక చేస్తున్నాయి. పార్టీ బలంతో పాటు కులం ఓట్లు తోడైతేనే గెలుపు సాధ్యమవుతుందనే ధీమాలో పార్టీల నేతలు ఉన్నారు. బరిలో నిలిచిన అభ్యర్థి సామాజిక వర్గం ఓట్లు ఎన్ని ఉన్నాయి.. ఆర్థికంగా బలంగా ఉన్నారా లేరా.. అనే కోణంలో కూడా పార్టీ పెద్దలు ఆలోచన చేస్తున్నారు. దీంతో ఎంతో ఆశతో బరిలో నిలిచిన నేతలకు కుల ప్రామాణికంగా పార్టీల మద్దతు దొరకని పరిస్థితి నెలకొంది. దీంతో బుధవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ కావటంతో బరిలో నిలిచేది ఎవరు..? పోటీ నుంచి తప్పుకునేది ఎవరు అనే ఉత్కంఠ నెలకొంది.

లొంగిపోయిన మావోయిస్టు రమేశ్

- 2005లో సోదరితో కలిసి అజ్ఞాతంలోకి..
- చైతన్య నాట్య మంచ్ డివిజనల్ సెక్రటరీగా రమేశ్
- రెండు దశాబ్దాల తర్వాత జనజీవన స్రవంతిలోకి..
- రమేశ్‌ది కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడ
- రూ.8 లక్షల రివార్డు.. తక్షణ సాయంగా రూ.25వేల అందజేత
- జనగామ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్



మావోయిస్టు రమేశ్‌కు రివార్డును అందిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఇస్రోజివాడకు చెందిన లోకేటి రమేశ్ అలియాస్ అశోక్ అలియాస్ నరేందర్ అలియాస్ రాజేశ్వర్ మంగళవారం జనగామ వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ ఎదుట లొంగిపోయారు. రమేశ్‌పై ఉన్న రూ. 8లక్షల రివార్డు ఉండగా, తక్షణ సాయంగా రూ.25 వేలు అందించారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో డీసీపీ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.

లోకేటి రమేశ్ అలియాస్ అశోక్ 2005లో తన సోదరి లావణ్యతో కలిసి సీపీఐ మావోయిస్ట్ పార్టీలో చేరాడు. ఏడాది పాటు సెంట్రల్ కమిటీ సభ్యురాలు పోతుల కల్పన అలియాస్ సుజాత దగ్గర పనిచేసి చైతన్య నాట్య మంచ్‌కు(సీఎన్ఎం) బదిలీ అయ్యాడు. ఆ తర్వాత 2008లో ఏరియా కమిటీ మెంబర్‌గా పదోన్నతి పొంది 2011 వరకు సీఎన్ఎంలోనే కొనసాగాడు. 2012లో ఎల్‌వోఎస్ కమాండర్‌గా పనిచేశాడు. 2013లో డివిజనల్ కమిటీ మెంబర్‌గా పదోన్నతి పామేడ్ ఏరియా కమిటీకి బదిలీ అయ్యాడు. 2016లో పామేడ్ ఏరియా కమిటీ మెంబర్ లొగొట్టా బొజ్జి అలియాస్ కమలను వివాహం చేసుకున్నాడు. కమల 2023లో అరెస్టయి ప్రస్తుతం రిమాండ్‌లో ఉంది. రమేశ్ 2019లో జోగురుగొండ ఎల్‌వోఎస్ కమాండర్‌గా పనిచేశాడు. 2021లో డివిజనల్ కమిటీ సెక్రటరీ పదోన్నతి పొంది దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ పరిధిలోని సౌత్‌బస్తర్ డివిజన్ కమిటీ అనుబంధ చైతన్య నాట్య మంచ్‌కు బదిలీ అయ్యాడు. రమేశ్ తండ్రి లోకేటి రాజేందర్‌రావు అలియాస్ చందర్ అలియాస్ పడకల స్వామి అలియాస్ ప్రభాకర్ అలియాస్ రవి ప్రస్తుతం దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ వెస్ట్ సబ్‌జోనల్ బ్యూరో సెక్రటరీ పనిచేస్తున్నాడు. ఆయుధాలు వీడి జనజీవన స్రవంతిలో కలవాలని ప్రభుత్వాలు చేస్తున్న విజ్ఞప్తులు, ఆరోగ్య సమస్యలు, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, సిద్ధాంతపరమైన విబేధాల కారణంగా రమేశ్ పార్టీని వీడినట్లు డీసీపీ తెలిపారు.

మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఎస్పీ చేతన్ నితిన్, స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ, జనగామ, రఘునాథపల్లి సీఐలు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథపల్లి ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

మేడారంలో చురుగ్గా అభివృద్ధి పనులు

- ముందస్తుగా వస్తున్న భక్తులు
- క్యూ లైన్ల ఏర్పాటుకు నమూనా పరిశీలన



నూతన క్యూ రెయిలింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

తాడ్వాయి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహా జాతర సమీపిస్తుండడంతో భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చి సమ్మక్క-సారలమ్మలను దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. మంగళవారం సుమారు 5 వేల మందికి పైగా భక్తులు మేడారం తరలి వచ్చి తల్లులను దర్శించుకున్నారు. దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా ఇబ్బందులు కలుగుతున్నా మొక్కులు చెల్లించుకోడానికి భక్తులు తరలి వస్తున్నారు. దేవతల గద్దెలకు పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, చీర, సారె, కొబ్బరికాయలు, ఎత్తు బంగారం, యాట మొక్కులతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

క్యూ లైన్ల నమూనా పరిశీలన

అధికారులు ఏర్పాటు చేస్తున్న నూతన క్యూ లైన్ల నమూనాలను కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐటీడీఏ అతిథి గృహం వద్ద పరిశీలించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగంలో చేపట్టిన క్యూ లైన్ల పనులకు సుమారు రూ. 5 కోట్ల నిధులతో రెయిలింగ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జాతర సమయంలో క్యూలో భక్తుల రద్దీ నివారించడానికి ఈ నమూనాలను పరిశీలించినట్లు తెలిపారు.

స్నాన ఘట్టాల క్లీనింగ్ పనులు

జాతర సమయంలో జంపన్న వాగులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరిస్తారు. స్నాన ఘట్టాల క్లీనింగ్ పనులను మంగళవారం అధికారులు చేపట్టారు. స్నానఘట్టాలపై ఉన్న మట్టి, ఇసుక, గడ్డి, ఇతర వ్యర్థాలను తొలగించారు. అలాగే దేవస్థానం అభివృద్ధి పనుల్లో భాగంగా భారీ రాతి స్తంభాలను ఎత్తేందుకు రెండు భారీ క్రేన్లు మేడారం దేవస్థానానికి వచ్చాయి.

యాసిడ్ చల్లింది ఎవరు?

మిస్టరీగా మారిన ఘటన ● పోలీసులకు దొరకని క్లూ

వరంగల్ క్రైం, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని కడిపికొండలో సోమవారం రాత్రి నర్సింగ్ విద్యార్థినిపై జరిగిన యాసిడ్‌దాడి ఉమ్మడి వరంగల్‌లో ప్రకంపనలు సృష్టించింది. హనుమకొండ పద్మాక్షిగుట్ట సమీపంలోని నర్సింగ్ కళాశాల నుంచి తన అమ్మమ్మ ఊరైన ఐనవోలు మండలంలోని వెంకటాపూర్‌కు సోమవారం సాయంత్రం స్కూటీపై బయలుదేరిన సునంద అనే యువతిపై సుమారు సాయంత్రం సుమారు 6.05 నుంచి 6.10 నిమిషాల మధ్య యాసిడ్ దాడి జరిగిందనే విషయం సోషల్‌మీడియా ద్వారా దావానంలా వ్యాపించింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు వెళ్లి బాధితురాలిని బంధువుల సహాయంతో ఎంజీఎంకు తరలించారు. ఆ సమయంలో యువతి హెల్మెట్ ధరించడంతో పెనుప్రమాదం తప్పినట్లుగా పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, దాడిపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు. ఆకతాయిల దాడినా..? ఉద్దేశపూర్వకంగా చేసిన దాడినా? బాధిత యువతి కుటుంబసభ్యు లకు ఎవరితోనైనా వివాదం ఉంటే ఆ కక్షను యువతిపై తీర్చుకోవాలనుకున్నారా..? అనేది పోలీసులకు ఇప్పటి వరకు అంతుపట్టడం లేదు. బాధిత యువతి మాత్రం తనకు ఎవరితో వ్యక్తిగత వివాదం లేదని, తనపై ఏదో తెలియని ద్రవం పడిందని తెలుసుకునేలోపే ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు వెళ్లడం కనిపించిందని చెబుతోంది. ఇదిలా ఉంటే.. యువతిపై పడ్డ ద్రవంపై సైతం విభిన్నంగా చర్చ జరుగుతోంది. అది బాత్‌రూముల్లో వాడే రసాయనాలని పోలీసులు చెబుతుంటే.. వైద్యులు మాత్రం బలహీనమైన స్వభావం గల యాసిడ్‌గా పేర్కొంటున్నారు. అయితే యాసిడ్ దాడి ఎవరు చేశారు..? ఎందుకు చేశారు..? ఏ ద్రవంతో చేశారు..? అనేది పోలీసులకు సవాల్‌గా మారింది. 30 మీటర్ల దూరంలో ఉన్న సీసీ కెమెరాలో పరిశీలించగా చాలా వాహనాలు యువతి వాహనం వెనకాల వెళ్లినట్లుగా తెలుస్తోంది. ఆ సమయంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగి సైతం సమీపం నుంచి నడుచుకుంటూ వెళ్తున్నట్లుగా తెలుస్తోంది. అయినా దాడిపై ఎవరూ చెప్పలేకపోతున్నారు. నిందితులను గుర్తించేందుకు పోలీసులు హనుమకొండ నుంచి కడిపికొండ వరకు యువతి వచ్చిన మార్గంలో ఉన్న ప్రతీ సీసీ కెమెరా ఫుటేజీను పరిశీలించారు. ఎవరు వెంబడించారనేది ఆరా తీస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు దొరకట్లేదని తెలుస్తోంది. యువతి స్వల్పగాయాలతో బయటపడి చికిత్స తీసుకుంటూ మంగళవారం పరీక్షలు హాజరైంది. కాగా, ఈ ఘటన 2008, 2017 సంవత్సరాల్లో జరిగిన యాసిడ్ దాడి ఘటనలను గుర్తుకు తెచ్చింది. నాడు రెండు ఘటనలు డిసెంబరులోనే జరగగా, తాజా ఘటన కూడా డిసెంబరులోనే జరగడం గమనార్హం.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

బాలికపై అత్యాచారం.. గర్భం దాల్చడంతో అబార్షన్

బయ్యారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడగా గర్భం దాల్చడంతో.. ఆమెకు అబార్షన్ చేయించిన ఘటనలో బయ్యారానికి చెందిన వ్యక్తిపై మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో పోక్సోచట్టం కింద కేసు నమోదైంది. సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలకేంద్రానికి చెందిన సైదులుబాబు అనే వ్యక్తి ఓ మహిళతో కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆమె కూతురు (15)పై కూడా సైదులుబాబు పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాలిక గర్భందాల్చగా తల్లి సహాయంతో సైదులుబాబు మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించినట్లు సీఐ పేర్కొన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు సైదులుబాబుపై పోక్సోకేసు నమోదు చేసినట్లు తెలిపారు. అబార్షన్‌కు సహకరించిన బాలిక తల్లిపై కూడా కేసు నమోదు చేసి ఇరువురిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. కాగా, బాలికను జిల్లా కేంద్రంలోని బాల సదనం సంరక్షణ కేంద్రానికి తరలించారు.

కెరీర్ ఎంపికలో స్పష్టత ఉండాలి

• ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కెరీర్ ఎంపికలో స్పష్టత ఉండాలని కలెక్టర్ టీఎస్.దివాకర అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్కేవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిధిలోని 40 ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కెరీర్ గైడెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై షై సెల్ఫ్ ఈవెంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. 30 ప్రత్యేక సెషన్ల ద్వారా విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సెషన్ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం, భవిష్యత్ లక్ష్య నిర్ధారణ, వ్యక్తిత్వ వికాసం, ఉన్నత విద్యావకాశాలు, పోటీ పరీక్షల అవగాహన, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారించనుందన్నారు. సెషన్ల ఉపాధ్యాయులు సమర్థవంతంగా సమన్వయం చేసి ప్రతి విద్యార్థి ఈ కార్యక్రమం నుంచి గరిష్ఠ ప్రయోజనం పొందేలా చూడాలని ఆయన సూచించారు. విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కీ స్టోన్ పాఠశాల ఫౌండర్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ ములుగు వంటి మారుమూల ప్రాంతాల్లో విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసే బాధ్యత క్రియాశీలకమన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్యావకాశాలు, స్కాలర్‌షిప్‌లు, ప్రపంచస్థాయి అవకాశాలపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు డిగ్రీ పూర్తి చేసేంత వరకు స్కాలర్‌షిప్ అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. డీఈవో సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి పాఠశాలలో సమగ్ర కెరీర్ గైడెన్స్ వాతావరణం ఏర్పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అర్జం రాజు, 'ఉల్లాస్' జిల్లా కోఆర్డినేటర్ కృష్ణబాబు, స్కేవర్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కుదిరితే బేరం.. లేదంటే వైరం

• ఏకగ్రీవాలపై ఫోకస్ పెట్టిన అధికార పార్టీ

• ఇతర పార్టీల అభ్యర్థులకు గాలం • ఇప్పటికే జోరుగా మంతనాలు



ములుగు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయాలు వేడెక్కాయి. పోలింగ్ లేకుండానే ఆయా స్థానాలను తమ ఖాతాల్లోకి వేసుకొనేందుకు అధికార పార్టీ ఉవ్విళ్లూరు తోంది. ఏకగ్రీవం చేసుకొనేందుకు పడరాని పాట్లు పడుతోంది. బరిలో ఉన్న ఇతర పార్టీలు, స్వాతంత్ర్య అభ్యర్థులతో కీలక నేతలు మంతనాలు జరుపు తున్నట్లు తెలుస్తోంది. తమకు కావాల్సిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు బేరసారాలు సాగిస్తున్నట్లు సమాచారం. వినకపోతే బెదిరింపులకు దిగుతున్నారనే ఆరోపణలు కూడా ఇతర పార్టీల నుంచి వస్తున్నాయి. మొదటి విడత స్క్రూటినీ ముగియడంతో బరిలో ఎవరుండబోతున్నారో తెలుసుకొని వారి వద్దకు వెళ్లి విత్ డ్రా చేయించేందుకు బుజ్జగింపులు చేపడుతున్నారని సమాచారం. వినకపోతే వారి బంధువులు, కుల సంఘం పెద్దలతో మాట్లాడించి రాజీ కుదురుస్తున్నారు. సర్పంచ్ పోటీ నుంచి తప్పుకుంటే కాంట్రాక్టులు, వేరే పదవులు, కోరినంత డబ్బు ఇస్తానని ఆశ చూపుతున్నారని తెలుస్తోంది. ఇప్పుడు సహకరిస్తే రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రాధాన్యం ఇస్తామని కూడా బేరసారాలాడుతున్నారనే చర్చ జోరుగా సాగుతోంది.

జిల్లాలో 9 మండలాల్లో ఎన్నికలు

ములుగు జిల్లాలో 10 మండలాలు ఉన్నాయి. మంగపేట మండలంలో గిరిజన, గిరిజనేతర ప్రాంతం వివాదం ఉన్న నేపథ్యంలో కోర్టు స్టే విధించగా ఇక్కడ ఎన్నికలు జరగడం లేదు. దీంతో మిగిలిన తొమ్మిది మండలాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. మొదటి విడతగా గత నెల 27 నుంచి ఏటూరునాగారం, తాడ్వాయి, గోవిందరావుపేట మండలాలకు నామినేషన్లు స్వీకరించారు. మూడు గ్రామ పంచాయతీల్లోని 420 వార్డుల నుంచి 1,363 నామినేషన్లు దాఖలయ్యాయి. గత నెల 30 నుంచి రెండో విడత నామినేషన్లు జేడీ మల్లంపల్లి, ములుగు, వెంకటాపూర్ మండలాల నుంచి తీసుకుంటున్నారు. ఈనెల 3 నుంచి కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేడు మొదటి విడత విత్‌డ్రా

తాడ్వాయి, ఏటూరునాగారం, గోవిందరావుపేట మండలాల్లో మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ ముగియడంతో అధికారులు సోమవారం స్క్రూటినీ చేసి, ఫిర్యాదులు స్వీకరించారు. బుధవారం నామినేషన్ల విత్‌డ్రాకు రంగం సిద్ధం చేస్తున్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనైనా పోటీలో ఉండి గెలిచి సర్పంచ్‌గా నిలవాలని పలువురు భావిస్తుండగా, మరికొందరు నేతలు ఏకగ్రీవాల పేరిట వారి ఆశలపై నీళ్లు చల్లుతున్నారు.

చిన్న గ్రామ పంచాయతీలపై నజర్

జిల్లాలోని మేజర్ గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ అనుచరులను బరిలో ఉంచేందుకు సిద్ధపడుతున్నారు. అయితే.. పలు చోట్ల తాము అనుకున్న అభ్యర్థికి సర్పంచ్ పదవి, వారు అనుకున్న అభ్యర్థికి ఉప సర్పంచ్ పదవి, ఇంకో పార్టీ సహచరులకు వార్డు మెంబర్ ఇస్తామని బేరం కుదుర్చుకుంటున్నారని తెలుస్తోంది. మరికొన్ని గ్రామ పంచాయతీల్లో ఢీ అంటూ బరిలో నిలుస్తున్నారు. అయితే.. చిన్న గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఏకగ్రీవం చేసుకుంటేనే మంచిదని సలహా ఇస్తూ అక్కడ పోటీ లేకుండా చూసుకుంటున్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

ములుగు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీలో సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ నరేష్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లతో కలిసి మంగళవారం ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ హెచ్‌ఐవీ లైంగిక సంబంధాలు, కలుషిత ఇంజక్షన్లు, పరీక్షించని రక్త మార్పిడి, హెచ్‌ఐవీ గర్భిణీ నుంచి పుట్టబోయే బిడ్డకి సంక్రమిస్తుందని తెలిపారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదన్నారు. కార్యక్రమంలో అవుట్‌రిచ్ వర్కర్ టి.కిషన్, మెడికల్ ఆఫీసర్ నాగఅన్వేష్, ఏఎన్ఎంలు, ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



బీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న లక్ష్మణ్‌బాబు

ఏటూరునాగారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పార్టీల చెందిన పలువురు కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు గడదాసు సునీల్ కుమార్, టౌన్ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజాపాషా ఆధ్వర్యంలో కాంగ్రెస్ నుంచి సుమారు 10 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ములుగు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మనర్సింహరావు(లక్ష్మణ్ బాబు) గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి కాకులమర్రి శ్రీలత, సీనియర్ నాయకులు తాడూరి రఘు, తుమ్మ మల్లారెడ్డి, ఎమ్డీ. షఫీ, ఎమ్డీ. వలిబాబా, కాకులమర్రి ప్రదీప్‌రావు, కూనూరు అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులు పెట్టొద్దు

గోవిందరావుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల నేపథ్యంలో ఎవరైనా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సోషల్‌మీడియాలో ప్రత్యర్థులపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతరులకు హాని కలిగించే పోస్టులు షేర్ చేస్తే గ్రూప్ అడ్మిన్‌ను కూడా బాధ్యులను చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని, గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, బెల్టుషాపులు నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేటి దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ములుగులోని బండారుపల్లి రోడ్డులో గల గిరిజన భవన్‌లో ఈనెల 3న (బుధవారం) నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి తుల రవి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ టీఎస్.దివాకర ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని, జిల్లాలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఆయన కోరారు.

బస్టాండ్ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణంలో ఉన్న బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

మంగపేట డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కన నిర్మిస్తున్న బస్టాండ్‌ను మంగళవారం ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.సల్మాన్, వరంగల్ ఈఈ రవీంద్రనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణ పనులు జరుగుతున్నాయా ? అని తనిఖీ చేశారు. బస్టాండ్ నిర్మాణం పూర్తి కావస్తున్నా ఇంకా టాయిలెట్లు ఎందుకు నిర్మించలేదని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా త్వరలోనే టాయిలెట్లు నిర్మిస్తామని చేపడుతామని తెలిపారు. వారి వెంట వరంగల్ డిప్యూటీ ఇంజనీర్ ఆంజనేయులు ఉన్నారు.

సైబర్ నేరాల నివారణపై అవగాహన

వాజేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల నివారణపై ఎస్సై జక్కుల సతీష్ యువకులకు అవగాహన కల్పించారు. మండలంలోని జగన్నాథపురంలో యువకులతో ఆయన మాట్లాడారు. యువత సైబర్ నేరాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచితుల నుంచి ఫోన్లు, వీడియో కాల్స్ వస్తే లిఫ్ట్ చేయకూడదని సూచించారు. ఎవరైనా డిజిటల్ అరెస్టుల పేరుతో బెదిరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కన్నాయిగూడెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుర్రేవులలో ఎంఏసీఎస్ (మ్యాక్స్) ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఏవో ముంజ మహేష్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళారులకు పంటను అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో కల్యాణి, ఆర్ఐ గణేష్, సెంటర్ ఇన్‌చార్జి పూజారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సహాయకులకు అవగాహన

వాజేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ కేంద్రాల ఎన్నికల సహాయకులగా వ్యవహరించే కార్యదర్శులు, జీపీవోలకు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కల్పించారు. నామినేషన్ పత్రాలు నింపే అభ్యర్థులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సహాయకులపై ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో విజయ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల నరికివేత పనులు పూర్తి చేయాలి

కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్

మల్హర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన తాడిచర్ల నుంచి కిషన్‌రావుపల్లి మీదుగా భూపాలపల్లి వరకు చేపడుతున్న రోడ్డు పనుల్లో భాగంగా చెట్ల నరికివేత పనులు వేగంగా పూర్తి చేయాలని కాళేశ్వరం సీసీఎఫ్ ప్రభాకర్ అన్నారు. రోడ్డుకు సాగుతున్న చెట్ల నరికివేతను ఆయన మంగళవారం పరిశీలించారు. పనులు నత్తనడకన సాగుతుండటంతో కొంత అసహనం వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో చెట్ల నరికితవేత పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి, ఎఫ్‌డీవో, రేంజర్లు, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

ధాన్యం సేకరణను ముమ్మరం చేయాలి

అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్



రేగులగూడెం పీఏసీలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

కాటారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ధాన్యం సేకరణ ప్రక్రియను ముమ్మరం చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లి, చింతకాని, రేగులగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయ్ జిల్లా అధికారి కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. 'మందకొడిగా ధాన్యం సేకరణ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. శుభ్రం చేసిన తేమ శాతం17వరకు ఉన్న వడ్లను ఎప్పటికప్పుడు కాంటా చేసి బస్తాలను మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కాంటాలు, మాయిశ్చర్ మిషన్లు, గన్నీ సంచులు, వడ్ల బస్తాలపై కప్పే టార్పాలిన్ల లభ్యత తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. రైతులతో మాట్లాడి త్వరితగతిన నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యం తయారు చేసి కుప్పలుగా పోస్తే కాంటాలు త్వరితగతిన చేయిస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ నాగరాజు, పీఏసీఎస్ సీఈవో ఎడ్ల సతీష్, ఏఈవోలు అస్మా, దివ్యజ్యోతి, పీఏసీఎస్ సిబ్బంది సాంబమూర్తి, కార్తీక్ తదితరులు ఉన్నారు.

దత్తాత్రేయ ఆలయంలో వైభవంగా హోమం



మన్యుసూక్త హోమం నిర్వహణలో వేదపండితులు, భక్తులు

కాటారం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్త నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఆలయంలో అర్చకులు మంగళవారం దత్తాత్రేయస్వామి, కాశీకేదారేశ్వరస్వామి, ఆంజనేయస్వామికి మన్యుసూక్త అభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తల్లి జయశ్రీ వేదపండితులు కృష్ణమోహన్, ప్రవీణ్, గణేష్, సుమిత్ పాండే, లక్ష్మీకాంత్, భాస్కర్, రామ్మూర్తి తదితరుల చేతులమీదుగా మన్యుసూక్త హోమాన్ని వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, పలు ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సీఐని ఎస్సీ, ఎస్టీ నాయకులు



ఏఆర్ సీఐని కలిసికి తెలుపుతున్న ఎస్సీ ఎస్టీ సంఘం నాయకులు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏఆర్ సీఐ కాశీరాం నాయక్‌ను ఎస్సీ, ఎస్టీ సంఘం నాయకులు, లంబాడి హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు అజ్మీరా తిరుపతి నాయక్ తదితరులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పారు. ఈ కార్యక్రమంలో బానోతు రాకేష్, అజ్మీరా సమ్మయ్య, జోగుల సమ్మయ్య, హరినాథ్, సురేష్, హరీష్, రాజేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రెండో విడత నామినేషన్లు

కృష్ణకాలనీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లాలో రెండో విడత నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. భూపాలపల్లి, టేకుమట్ల, పలిమెల, చిట్యాల మండలాల్లో నవంబరు 30 నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై మూడు రోజుల పాటు కొనసాగింది. బుధవారం నామినేషన్ల పరిశీలన, అదే రోజు అభ్యర్థుల ప్రకటన చేయనున్నారు. ఈనెల 4న అభ్యంతరాల స్వీకరణ, 5న అభ్యంతరాల స్వీకరణ ఆఖరు తేదీ, 6న ఉపసంహరణ, అదే రోజు అభ్యర్థుల ప్రకటన వెలువడనుంది. ఈ నెల 14న పోలింగ్, మధ్యాహ్నం కౌటింగ్, సాయంత్రం ఫలితాల వెల్లడి కానున్నారు.

చివరి రోజు భారీ సంఖ్యలో

రెండో విడుత నామినేషన్ల ప్రక్రియ మొదటి, రెండో రోజు నామమాత్రంగా సాగింది చివరి రోజు బుధవారం నాలుగు మండలాల్లో భారీగానే దాఖలయ్యాయి. నాలుగు మండలాల్లో మొత్తంగా 85 సర్పంచ్ స్థానాలు, 695 వార్డు స్థానాలు ఉన్నాయి. వీటిలో పలివెల మండలంలో మొత్తం 8 సర్పంచ్ స్థానాలు ఉండగా.. 36 నామినేషన్‌లు దాఖలయ్యాయి. 62 వార్డు స్థానాలు ఉండగా.. 108 నామినేషన్లు దాఖలై నట్లు అధికారులు వెల్లడించారు. టేకుమట్ల మండ లంలో మొత్తం 25 సర్పంచ్ స్థానాలు ఉండగా 139 నామినేషనున్న దాఖలయ్యాయి. 198 వార్డులుండగా 393 దాఖలయ్యాయి. భూపాలపల్లి మందస్తుగా టోకెన్లు జారీ చేయడంతో అర్ధరాత్రి వరకు నామినేషన్ల స్వీకరణ కొనసాగింది. చిట్యాలలో మొత్తం 26 సర్పంచ్ స్థానాలకు 86, వార్డు సభ్యులు 218 స్థానాలకు 336 నామినేషన్లు దాఖలయ్యాయి.

నేటి నుంచి మూడో విడత

మూడో విడత నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభం కానుంది. మంథని నియోజకవర్గ పరిధిలోని మల్హర్, మహదేవపూర్, మహాముత్తారం, కాటారం మండలాలకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. నాలుగు మండలాల్లో 81 సర్పంచ్ స్థానాలు, 696 వార్డు సభ్యుల స్థానాలు ఉన్నాయి.

పంచాయతీ ఎన్నికల నామినేషన్ కౌంటర్ — మూడో రోజు 2-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
టేకుమట్ల	25	72 (239)	198	393 (484)
పలిమెల	08	36 (44)	62	108 (137)
చిట్యాల	26	86 (163)	218	336 (555)

నోట్ : (బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

రోడ్ల పనులు త్వరతగతిన పూర్తి చేయాలి: కలెక్టర్

(5వ పేజీ తరువాయి)

వివరించాలని తెలిపారు. నాణ్యత విషయంలో రాజీపడొద్దని, క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పరీక్షలు చేయించాలని ఆదేశించారు. మేడారం జాతర దృష్టి సమీపిస్తున్న దృష్ట్యా అనుసంధాన రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కాంట్రాక్టర్ పనులు విషయంలో ఆలసత్వం వహిస్తే వారిని తొలగించి మరొకరికి వేరొకరికి అవకాశం కల్పించాలన్నారు. ఆర్అండ్‌బీతోపాటు ఇతర ఇంజనీరింగ్ శాఖలతో మళ్లీ ఒక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆర్ అండ్‌బీ శాఖ ద్వారా ప్రణాళిక, ప్రణాళికేతర, డీఎంఎఫ్‌టీ, ఎస్డీఎఫ్, ఎస్సీ ఎఫ్డీఎఫ్, ఆర్డీఎఫ్ భవనాలు, సీఆర్ఐఎఫ్, ఎల్‌డబ్ల్యూఈ ద్వారా రూ.578.71 కోట్లతో 38 పనులు చేప ట్టామని, వాటిలో 7 పనులు పూర్తికాగా ఇంకా 16 పనులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇంకా 15 పనులు ప్రారం భమే కాలేదని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ రమేష్, సీపీవో బాబురావు, ఆర్అండ్‌బీ డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ముగిసిన రెండో విడత నామినేషన్లు

(5వ పేజీ తరువాయి)

సర్పంచ్ స్థానాలకు, 312 మంది వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్ వేశారు. ఏటూరునాగారం మండలంలో 84 మంది సర్పంచ్, 279 మంది వార్డు మెంబర్ స్థానాలకు నామినేషన్లు వేశారు. అయితే గోవింద రావుపేట మండలంలో కోటగడ్డ జీపీలో ఎస్టీ అభ్యర్థి ఒక్కరు ఉండడంతో తనే సర్పంచ్ కానుంది. చల్వాయి జీపీలో ఆరుగురు సర్పం చ్ పోటీకి నామినేషన్లు దాఖలు చేశారు. అందులో ఐదుగురు ఇప్పటికే విత్‌డ్రా చేసుకున్నట్లు సమాచారం. బుధవారం జరగనున్న నామినేషన్ల ఉప సం హరణలో మరెంత మంది విత్‌డ్రా చేసుకోనున్నారోననే చర్చ సాగుతోంది.

రెండో విడత చివరి రోజు ఇలా...

రెండో విడత నామినేషన్ల ప్రక్రియ చివరి రోజు జోరుగా సాగింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 9.30 గంటల వరకు వచ్చిన సమాచారం మేరకు.. వెంకటాపూర్, ములుగు, జేడీ మల్లంపల్లి మండలాల్లో 173 సర్పంచ్, 754 మంది వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. అర్ధరాత్రి వరకు ఈ ప్రక్రియ కొనసాగగా సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. అలాగే మూడు రోజుల్లో మూడు మండలాల నుంచి 286 సర్పంచ్, 1,109 వార్డు మెంబర్లకు అభ్యర్థులు నామినేషన్ వచ్చాయి.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

• ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు

• ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్



గట్టమ్మ వద్ద ట్రాఫిక్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

ములుగు టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతర సమీపిస్తున్న క్రమంలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మంగళవారం గట్టమ్మ దేవాలయం సమీపంలో వివిధ శాఖల అధికారులతో కలిసి రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాట్లాడుతూ మేడారానికి వచ్చే భక్తులు ముందుగా జాకారం సమీపంలోని గట్టమ్మ దేవాలయాన్ని దర్శించుకుంటారని ఆ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వివిధ శాఖల అధికారులతో కలిసి సమన్వయతో త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ములుగు డీఎస్పీ రవీందర్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శంకర్ నాయక్, సీఐ సురేష్, ఎస్ఐ వెంకటేశ్వర్ రావు, విద్యుత్ ఏఈ రఘు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కనికరించరేం..!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం పునఃరాలోచించి కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

స్పందించని అధికారులు

సింగరేణి భూపాలపల్లి ఏరియాలో మెడికల్ అన్‌ఫిట్ ఉద్యోగుల దరఖాస్తులకు మోక్షం కలగడం లేదనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని తెలుస్తోంది. కేటీకే 5వ గనిలో మోటపోతుల మల్లేష్ కోల్‌కట్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇప్పటికే ఆయన సింగరేణిలో 32ఏళ్ల సర్వీస్ పూర్తిచేశాడు. అయితే... ఆయన మెడ ఎముకలు, వెన్నుముక ఎముకలు, కీళ్ల అరిగిపోయి పనిచేయలేని దుస్థితిలో ఉన్నాడు. ఈ క్రమంలో సింగరేణి ఆస్పత్రుల చుట్టూ తిరిగాడు. చివరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి మెడ ఎముకల సర్జరీ కూడా చేపించుకున్నాడు. కానీ ఎముకలు అరిగిపోవడంతో స్క్రూలు బిగించి తాత్కాలిక ఉపశమనం కోసం ఏర్పాట్లు చేశారు. ఇంకా వెన్నుముక ఎముకల పరిస్థితి కూడా అలాగే ఉంది. ఆపరేషన్ చేస్తే కాళ్లు, చేతులు పనిచేస్తాయో లేదో గ్యారెంటీ ఇవ్వలేమని వైద్యులు తెలపడంతో అందుకు మల్లేష్ అంగీకరించలేదు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. కూర్చుంటే నిలబడడానికి కొంత సమయం పడుతుంది. అలాగే బరువులు మోయలేడు.. మెడను వంచలేడు. ఇలా ఏ పని చేయలేని పరిస్థితిలో ఉన్నానని మల్లేష్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆయన భార్య కూడా అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు లంగ్స్ ఇన్‌ఫెక్షన్ ఉండటంతో అప్పుడప్పుడు నోట్లో నుంచి రక్తం పడుతోందని మల్లేష్ తెలిపాడు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉండగా వివాహాలు జరిగాయని తెలిపాడు. అయితే... తన కుమారుడికి వారసత్వ ఉద్యోగం పెట్టించడం కోసం తన ఆస్పత్రి రిపోర్టులను జతచేసి మే 11న దరఖాస్తు పెట్టుకున్నాడు. కానీ మల్లేష్ అనారోగ్యబారినపడి విధులకు వెళ్లలేకపోతున్నాడు. నేటికి ఏడాదిన్నర కాలం అవుతుందని తెలిపాడు. అయితే.. అప్పటి నుంచి ఇప్పటివరకు తనకు వేతనం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు.

అలాగే భూపాలపల్లి ఏరియా వర్క్‌షాపులో సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న అవిరినేని తిరుపతిరావు కూడా ఇలాంటి అవస్థే పడుతున్నాడు. మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న తాను... మెడికల్ అన్‌ఫిట్ చేసి తన వారసుడికి ఉద్యోగం ఇవ్వాలని కోరినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఇలా అనేక మంది ఉద్యోగులు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.. ఈ విషయంపై సీఎండీ జోక్యం చేసుకుని తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు.